# గాయం

- కె.కె.రఘునందన

"మీ హెడ్మాస్టర్ ఉన్నారా?" ఎవరో అడిగారు.

నేను వెనక్కి తిరిగి చూడనే లేదు. "వస్తారు కూచోండి... ఇంతకీ దేనికి?" అన్నాను.

"దేనికో మీకు అనవసరం. వచ్చేదేమైనా ఉందా లేదా? అంతవరకూ మేం కూచోవాలా? ఏంటి?" తల బిరుసుతనం ప్రస్ఫుటిస్తోంది.

"చెప్పానా! అలా బయట కూచోమని.. రెండు గంట లక్కానీ రారు." తిరిగి జవాబిచ్చాను.

"ఏరా! నేనొస్తే కుర్చీలోంచి కూడా లేవకుండా జవాబు చెబుతున్నావే! నీకంత పొగరుగా ఉందా?" అని అమాంతం నా ఎదురుగా వచ్చి కర్రతో నా తలమీద ఒక్క వేటు వేసాడు! అంతే నా తల చిట్లింది. ఒక్కసారిగా పోటు...ఒకటే రక్తం...

"ఒర్నీ! దుంపతెగ! నువ్వెవడివిరా! స్కూల్లోకి వచ్చి మరీ కొడతావా?" అటెండర్ కూర్మారావు పెద్ద గొంతు పెట్టుకుని అరిచాడు.

ఆ అరుపుకి పిల్లలంతా పరుగున వచ్చి చూసి బెంబేలెత్తిపోయారు. "గుమాస్తాగార్ని ఎవరో కొట్టే సారు.. రక్తం.. అమ్మో!" అంటూ వాళ్ళు ఒకటే పరుగులు. అప్పుడే భోజనంచేసి బయటనుంచి వస్తున్న స్టాఫ్ పరిగెత్తుకొచ్చారు. నేను తలమీద చేయి పెట్టుకొని కారుతున్న రక్తాన్ని అదిమి పెడుతున్నాను. కూర్మారావు అంతా వివరిస్తున్నాడు.

దాంతో పేట్రేగిపోయిన డ్రిల్ మేస్టారు మనోజ్ ఆ ఆగంతకుడిని నిలువరించాడు.

"ఎవడివిరా నువ్వు? మా స్కూల్లోకి వచ్చి మమ్మల్నే కొడతావా? నీకెన్ని దమ్ములు?" అనివాడిమీద తిరగబడ్డాడు.

ఆ వచ్చిన వాడిలో ఏమాత్రం బిరుసుతనం తగ్గలేదు. నేను స్పృహ తప్పేలా ఉన్నాను. "ఆ ముందు గుమాస్తాగారిని హాస్పిటల్‌కి తీసుకెళదాం పదండి." సోషల్ మేష్టారు కరంచంద్ ముందుకు దారితీశాడు. నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళే ప్రయత్నాల్లో పడ్డారు.

ఈలోగా హెడ్మాస్టర్ వచ్చి జరిగిన ఘోరానికి చింతించి, నామీదకి దాడికి దిగిన వాడిని పోలీసులకి అప్పచెప్పాలని అన్నారు.

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే మా పాఠశాలలో ఇటువంటి అనూహ్య సంఘటన జరగటం చాలా అన్యాయమన్నారు. ఊరంతా ఈ విషయం తెలిసింది. నాపై దాడి చేసిన వాడు సింహాద్రి. పక్కా తాగుబోతు. వాడికో మటన్ కొట్టున్నదట! వాళ్ళావిడ ఏదో సంఘానికి ప్రెసిడెంట్. అదీ వాడి గర్వం. ఎన్నికలొస్తే ఊర్లో చక్రం తిప్పేది వాడేనట! వీరంగం వేస్తుంటాడట! రగడ చేయడంలో సిద్ధహస్తుడట...!

ప్రభుత్వ ఆసుపత్రిలో నాకు ప్రథమ చికిత్స చేసి టి.టి. ఇచ్చారు.


"లేదు. ఇటువంటి తాగుబోతుని క్షమించి వదిలిపెట్టకూడదు. ఇంతకీ వాడేడీ?" అడిగారు హెడ్మాస్టర్.

"బండిమీద ఎక్కించాం. కొంతదూరం వెళ్ళాక గెంతి పారిపోయాడు. అయినా పోలీసులనుంచి తప్పించుకొని ఎక్కడకెళ్ళగలడు? ఎంతకాలం అలా దాక్కోగలడు?" అన్నారు ఉక్రోషంగా తెలుగు పండితులు శ్రీమన్నారాయణ.

మేమంతా పదండంటే పదండని పోలీసుస్టేషనుకి బయలుదేరాం. సరిగ్గా అక్కడ ఊళ్ళోవాళ్ళు మమ్మల్ని అడ్డగించారు. నామీద సానుభూతికి కొదువలేదు. సింహాద్రిని వెనకేసుకురావడంలోనే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చినట్టు కనిపించింది.

"వాడికి తాగుడు ఓ చెడ్డ అలవాటు. నిజానికి మీమీద దాడి తప్పే! కానీ అన్నీ తెలిసి మీరిలా పోలీసు కేసు పెట్టడం మాత్రం ఏం బాగోలేదు." అన్నాడు రాజకీయవేత్త రామారావు.

"మనలోమనం రాజీ చేసుకుంటే బాగుంటుంది.



తాగుడులో ఎవరో తెలీక మిమ్మల్ని కొట్టేసి ఉంటాడు. మీమీద వాడికేమైనా కసి ఉందా? ఏదో ఖర్మకొద్దీ జరిగిందనుకుందాం." శాంతపరచటానికి ఊర్లోవాళ్ళు ముమ్మర ప్రయత్నాలు మొదలెట్టారు. నా గాయం రేపుతున్న బాధలో నేనున్నాను. నా తోటి సిబ్బంది మాత్రం మహా పట్టుదలగా ఉన్నారు. ఓ తాగుబోతు అదీ పట్టపగలు ప్రభుత్వ కార్యాలయంలోకి వచ్చి ఉద్యోగస్థుడిని కర్రతో దాడిచేయటమా? అదీ మావాళ్ళు గట్టిగా వినిపించిన వాదన. ఆ దారుణ చర్య ఎంత నికృష్టమైనదో చెప్పి ఎదురుతిరిగారు. సింహాద్రికి ఎలాగైనా కటకటాలు తప్పవన్నారు.

"అలాగే సార్! ఈరోజుతో అయిపోలేదు. మీ స్కూల్లో ఎన్ని కన్నాలున్నాయో, మాకు తెలుసు. విలేకర్లు ఎన్నోసార్లు మీమీద న్యూసిస్తామన్నా పోనీలెండని ఊరుకున్నాం. మీరు సింహాద్రి విషయంలో సీరియస్‌గా తీసుకుంటే మేం మీ అంతు తేలుస్తాం." నిజానికి వాళ్ళన్నదాంట్లో ఎంతమాత్రం నిజంలేదనే చెప్పాలి. సాధారణంగా పల్లెటూళ్ళలో ఏమాత్రం సందు దొరికినా ఉపాధ్యాయుల మీదనే తిరుగుబాటు ప్రకటిస్తారు. మరే ఉద్యోగినీ అడగలేదు. ఈమధ్య మా ఊరి విలేకర్లు వాళ్ళ పత్రికలో ప్రకటన ఇమ్మంటూ వేధించటం మొదలెట్టారు. ఇవ్వకపోతే మా స్కూలుమీద వ్యతిరేకంగా వార్తలు రాస్తామంటూ హెచ్చరికలొకటి. అయినా మేమే వరం లొంగలేదు. దాని ప్రభావం కొంతపడినా ఆశ్చర్య పోనక్కర్లేదు.

ఊర్లో వాళ్ళు చాలామంది గుమిగూడారు. ముఖ్యంగా సింహాద్రి తండ్రి నా దగ్గరకొచ్చి నా చేతులు పట్టుకున్నాడు.

"మావాడిదే తప్పు బాబూ! పోలీసు కేసులంటే సెడ్డసిక్కయ్యా! ఆడెక్కడున్నా మీ పాదాలకాడ పడేస్తానయ్యా! మీరు పెద్ద మనసుతో సెమించాల." అని ఒకటే వేడుకున్నాడు.

ఆ క్షణం నాకంతా అయోమయంగా ఉంది. నా గాయం బాధతో నేను నిలవలేకపోతున్నాను. అందుకే నోరిప్పలేదు.

సర్పంచ్ వచ్చాడు. తీవ్ర విచారం వెలిబుచ్చాడు. సింహాద్రికోసం వెతకమని ఇద్దర్ని పంపాడు. పోలీసు కేసు పెట్టడంలో తప్పులేదని చెప్పి, మాకాయన మద్దత్తివ్వడంతో మా సిబ్బంది అంతా తెగ ఆనందించారు. అయితే అతగాడికి వ్యతిరేక వర్గం వాళ్ళు ఒక్కసారిగా వెర్రెత్తిపోయారు. మత్తులో తెలియక చేసిన దానికి పోలీసులదాకా ఎందుకు? ఏదోలా సెటిల్ చేయొచ్చుకదా! అని సూచించారు.

సర్పంచ్ మావైపు చూస్తూ "మీరు రాజీపడితే మీ ఇష్టం. అయితే ఓసారయినా ఇలాటి వాడికి బుద్ధి చెబితేగానీ జనాలకి మన విలువ తెలీదు. మరోడు ఇటువంటి పనికి పూనుకోడు." అని నిక్కచ్చిగా అనేసాడు.

మా సిబ్బంది మాత్రం వెనకడుగేసే ప్రశ్న లేదన్నారు. పోలీసు కేసు పెట్టడం ఖాయం అన్నారంతా! అదే సమయంలో నా సెల్ మార్మోగింది. ఆ రింగ్‌టోన్ ఎవరిదో నాకు తెలుసు. అది శ్రీమతి అంకితది. అయినా నేను ఆన్ చేయలేదు. ఈ పరిస్థితుల్లో చెప్పడం ఇష్టంలేదు. మా స్టాఫ్ ఇంటికి ఫోన్ చేయడం మంచిదన్నారు. వద్దని వారించాను.

సింహాద్రి మీద కేసు పెట్టవద్దన్నారు. అయినా మా స్టాఫ్ ఒకటే పట్టుదల ప్రదర్శించారు. మా వాళ్ళంతా పోలీసు స్టేషనులోకి వెళ్ళారు. వాతావరణం ఒకటే వాడి, వేడిగా ఉంది. యస్సై ఏదో పనిమీద బయటకి వెళ్ళాడట. ఎ.యస్.ఐ. మమ్మల్ని అంతా అడిగి ఫిర్యాదు రాయమన్నాడు. ఓవైపు విలేకరులు దండులా వచ్చి మీదపడ్డారు. మరోవైపు రాజీ పడమంటూ గ్రామస్థుల ఒత్తిడి. మా హెచ్.యమ్. మాత్రం ఇది క్షమించరానిదిగా పేర్కొని కేసు పెట్టడమే మంచిదని తేల్చేసారు. ఫిర్యాదు రాయడానికి పూనుకున్నారు. నా తరపున ఎవరో రాస్తే నేను మాత్రం సంతకం చేసాను. సింహాద్రిని వేటాడి మరీ పట్టుకొని సెల్లో తోస్తానని హామీఇచ్చాడు. ఎయస్సై ఆసరికే ఇద్దరు జవాన్లు బళ్ళు

వేసుకొని బయలుదేరారు. బయటంతా గొడవ గొడవగా ఉంది. అందరినోటంటా ఒకే మాట. ఏ కారణం లేకుండా ఒక ఉద్యోగిని కర్రతో దాడి చేయడమా! అది ఘోరాతిఘోరమన్నారంతా! రోజూలాగయితే నేనీపాటికి పార్వతీపురం తిరుగుముఖం పట్టేవాడిని. ఈరోజున ఏ కారణం చేత ఆలస్యమైందో తెలీక నానా ఆదుర్దా పడతారు ఇంట్లో! నేను కనీసం ఫోన్ కూడా రిసీవ్ చేసుకోలేదు మరి. పోనీ వెళ్ళాక ఇంట్లో పరిస్థితి?

ఆ ఆలోచనల్లో నేనుండగానే యస్సై వచ్చాడు. ఓ ప్రభుత్వ ఉద్యోగిని అకారణంగా గాయపరచటం ఎంత మాత్రం సహించరానిదన్నాడు. స్టేషన్ లోపలకి మేళంలా వెళ్ళారు ఊళ్ళోవాళ్ళు. ఫిర్యాదు నమోదుచేయద్దంటూ బతిమిలాడారు. మత్తులో ఉండి అలా ప్రవర్తించాడన్నారు. వాడిని పిలిచి కాళ్ళమీద పడేలా చేస్తామన్నారు. ఎలాగన్నా మావాళ్ళది ఉడుంపట్టే! సింహాద్రిని జైలుపాలు చెయ్యడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది మరోడికి గుణపాఠం కావాలన్నారు. యస్సై మాత్రం అందరినీ ఓసారి సమావేశపరచాడు. రాజీపడమని అననుగానీ మీరంతా ఏది మీకు న్యాయంగా ఉంటుందో అలాచేయడం మంచిదన్నాడు. ఆలోచించి రేపటిలోగా ఏ విషయం చెబితే అలా నమోదు చేద్దామన్నాడు. ఓసారి కేసును ఆన్‌లైన్‌లోకి పెట్టాక మరి వెనక్కి తీసుకునే వీలుండదన్నారు. ఎఫ్.ఐ.ఆర్ నోట్ చేసాక కోర్ట్ పరిధికి వెళ్ళిపోతుందన్నాడు. ఆ తర్వాత చట్టం తన పనితాను చేసుకుపోతుందన్నాడు.

"నా వేళా విశేషం బాగులేక ఖర్మకాలి ఇలా జరిగిందనుకుంటే సరిపోతుంది." అన్నాను. కాని నన్ను వెనక్కి తగ్గవద్దంటూ కిర్రెక్కించి వదిలారు. నేను ఆ పరిస్థితిలో మరేం మాట్లాడదలచుకోలేదు. ఇంటివైపు దృష్టి మరలింది. అక్కడ్నించి కదిలాను.

శ్రీమతి అంకిత నా తలపై కట్టు చూసి ఒకసారిగా బావురుమన్నది. ఎలా జరిగిందంటూ కంగారుగా ప్రశ్నించింది. కళ్ళనుండి నీళ్ళు జలపాతమై నన్ను తడిపేసింది. అంతా చెప్పాను. అకారణంగా కొట్టడానికి వాడికి చేతులెట్లా వచ్చాయంది. మా అబ్బాయి శ్రీధర్ నన్ను పట్టుకొని ఒకటే ఏడుపు. అమ్మాయి సరేసరి. బిక్కచచ్చిపోతోంది. నాకేం పర్వాలేదని సముదాయించాను. ఆ రాత్రి ఎవరికీ తిండి సహించలేదు. కాళరాత్రిలాగే గడిచింది. నా ఆలోచనలన్నీ పరిపరివిధాల విన్యాసం చేసాయి. ఉదయం సూరీడు కిరణాలు పడేవేళలో చిన్న కునుకు పట్టబోయింది. సరిగ్గా అదే సమయంలో ఎవరిదో ఆడగొంతు! వెళ్ళి తలుపుతీసింది అంకిత.

"జగన్నాథంగారి ఇల్లు ఇదేనా?" అడిగిందామె.

"ఔను! ఇదే! రండి." అని లోపలికి తీసుకుని వచ్చింది.

ఆమె నన్ను చూస్తూనే "అయ్యా! నన్ను మీరు సెమించండయ్యా! సెమించండి." అంటూ కాళ్ళమీద పడే ప్రయత్నం చేసింది. "ఏమ్మా! ఎవర్నువ్వు? లేలే!!" అంకిత వారించింది.

"అమ్మా! ఈ బాబుగోర్ని ఎపుడైతే కర్రుచ్చుకోని కొట్టాడో ఆ ముదనష్టపోడి పెల్లాన్ని. ఎంత తిట్టినాసరే సాల్దులెండి నేనేనమ్మా! ఆ సిమ్మాద్రిగాడు నా పెనిమిటేనమ్మా! ఎదవ సచ్చినాడు." అని విలవిలలాడుతూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఎందుకా బుడిబుడి రాగాలు. చేసిన వెధవ పని చాల్లే! రక్తం కళ్ళచూశాడు! అసలు మా ఆయన ఏంచేశారని కొట్టాడు. ముందు దీనికి జవాబియ్యి?" అని నిలదీసింది.

"అమ్మా ఆడిది ముమ్మాటికీ తప్పేనమ్మా! మందు అలవాటు తప్ప మరోటి ఆడికి నేదమ్మా ఇప్పటిదాక ఎవుర్నీ ఏటీ అన్న పాపాన పోనేదమ్మా! ఆడ్ని మీ ఇట్టవచ్చినట్టుగా సితకబాదీండినాను సంతోసిత్తాను. కాని, పోలీసు రిపోర్టియ్యమాకండయ్యా! మీకు పున్నెముంటది. మా కుటుంబం ఈదిన బడతాది. ఆడ్ని తెచ్చి తమ కాల్లకాడ పడెయ్యకపోతే నా పేరు సిన్నమ్మేకాదు" అని ఒకటే రోదన.

వాడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకొని కొట్లో వేసారట! నాలుగు పీకులు పీకారట కూడా! ప్రస్తుతం సింహాద్రి స్టేషనులో ఉన్నాట్ట ఈ విషయంలో తామేమీ చేయలేమని సర్పంచ్ చేతులెత్తేసాట్ట! పోలీసులు సైతం ఫిర్యాదుచేస్తే తామేం చేయలేమంటూ చెప్పేసారట. ఇంక నిర్ణయమంతా బాధితుడిదేనని తేల్చేసారట. అందుకే ఇంత ఉదయాన్నే పరిగెత్తుకుంటూ వచ్చేసింది. కేసుని కట్టద్దంటూ కాళ్ళవేళ్ళా పడింది.

"అమ్మా ఆడిది ముమ్మాటికీ తప్పేనమ్మా! మందు అలవాటు తప్ప మరోటి ఆడికి నేదమ్మా ఇప్పటిదాక ఎవుర్నీ ఏటీ అన్న పాపాన పోనేదమ్మా! ఆడ్ని మీ ఇట్టవచ్చినట్టుగా సితకబాదీండినాను సంతోసిత్తాను. కాని, పోలీసు రిపోర్టియ్యమాకండయ్యా!

"మీరు చేసిన ఘాతుకానికి మాకెవరికీ నిద్దర్లు లేవు. తిండి సయించటం లేదు. ఆయనకయిన గాయంవల్ల మా ఆయన ఏదో నేరం చేయబట్టేకదా కొట్టి వుంటాడనే భావం ఊర్లో వారిలో నాటుకుపోయింది. ఆ మచ్చ ఎలా పోతుంది చెప్పు? నీ వైపు ఒక్కటే నువ్వు ఆలోచిస్తున్నావు తప్ప మా కుటుంబం గురించి అసలు ఆలోచించటం లేదు." అంటూ ధ్వజమెత్తింది అంకిత. పిల్లలు సరేసరి.

"నాను బుర్రెత్తుకోలేకపోతున్నానమ్మా! ఆడు రౌడీ నాగ యిరగబడబట్టేగద మా బతుకులీయాల నడీదిలో పడ్డాయి. నల్లురూ సీ! అనేలా సేసాయి. అంతా మా దురదృష్టం! పిల్లలు అన్నాలు ముట్టలేదు. అయ్యా! అయ్యా! అంటూ ఒకటే కలవరింత." అంటూ గగ్గోలు పెట్టింది.

"అయినా ఇది నా చేతిలో లేదమ్మా! మా స్కూల్లో అందరి ఇష్టంమీద ఆధారపడి ఉంటుంది. నువ్వెళ్ళవచ్చు." అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న నేను నోరిప్పాను. ఆమె ఏదో అనబోతోంది. కానీ, మరి ఏమీ చెప్పద్దంటూ పంపేసింది అంకిత.

ఏమనుకుందో ఏమో కళ్ళొత్తుకుంటూ వెళ్ళిపోయింది సిన్నమ్మ.

మర్నాడు స్కూల్లో సమావేశం పెట్టారు. నేరగాడిని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టకూడదనే...! దాన్నే అందరూ బలపరిచారు. సరిగ్గా అదే సమయంలో సిన్నమ్మ మహిళా మండలి వారిని వెంటబెట్టుకొని వచ్చింది. వాళ్ళంతా ఆమెకు మద్దత్తిచ్చినట్టు చెబుతూ జరిగిన దానికి తామంతా ఎంతగా బాధపడ్డామో తెలియజేస్తూ, దోషి అయిన సింహాద్రికి క్షమాభిక్ష పెట్టమని కోరటానికి వచ్చామని, ఓ కుటుంబాన్ని ఇలా వీధులపాలు చేయకుండా చూడమని వేడుకున్నారు. ఓ ఆడ కూతురు కోర్టులంట తిరిగితే పిల్లల భవిష్యత్తు ఏమౌతుందో గమనించాలని, దయచూపాలని అర్థించారు. నేనేం నోరిప్పకుండా కూచున్నాను. మా సిబ్బంది మాత్రం దాడికి దిగారు. నిష్కారణంగా బుర్రపగలగొట్టిందికాక ఇంకా క్షమించమని కోరడానికి నోరెలా వచ్చిందని నిలదీశారంతా! మహిళలంతా మరీ మరీ బ్రతిమిలాడారు. ఎంత చెప్పినా మావాళ్ళు లొంగకపోవటంతో నిస్సహాయంగా వెనుదిరిగారు.

ఇది జరిగిన మరో అరగంటకు "అందరికీ శుభవార్త. సింహాద్రిని పట్టుకొని బొక్కలో పెట్టారు. వీరబాదుడు బాదారట." అని కూర్మారావు కబురు మోసుకొచ్చాడు.

"ఆ సంబరమేదో మనం కళ్ళారా చూస్తే తప్ప తృప్తి వుండదు. వాడి విరగబాటుకి విరుగుడు అయిందో లేదో చూడాల్సిందే! యస్సైని కలిసి కేసుని బిగిద్దాం" అని వెర్రిగా నవ్వాడు హిందీ పండితులు శేఖరాచార్య.

మేమంతా వెళ్ళి కలిసాక యస్సై నావైపు చూసి "ఆ వెధవని పిలుస్తానుండండి. ఏరా! సింహాద్రీ! ఇలా రారా!! ఎధవనాకొడకా! నీకు చెవుడేట్రా?" అని కేకేసి పిలిచాడు.

సింహాద్రి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"ఏరా! నువ్వు మందుకొట్టిందికాక నువ్వెళ్ళగానే లేవలేదని చెప్పి ఆళ్ళ బుర్ర బద్దలు కొట్టీడవేనేటి? ఏదీ ఇప్పుడు నాముందు ఈ గుమాస్తాని కొట్టు...ఔ! కానీ...! పోనీ నిన్ను నేను కొట్టీదా?" అంటూ ప్లాస్టిక్ గొట్టంతో బలంగా బాదసాగాడు. ఆ చప్పుడు బయటకు వినబడేటంతగా... సింహాద్రి కేకల్ని బాధతో మిన్నుముట్టాయి. వాడ్ని పంపించేసాక మావైపు తిరిగి "మేం ఇంకా కేసు కట్టలేదు. రేపు కూడా ఆలోచించుకోండి. ఓసారి ఆన్‌లైన్ అయ్యాక మరి వెనక్కి తీసుకోలేం. వీడు చేసిన వెధవ పనికి పెళ్ళాం, పిల్లలు ఒకటే గోలెడుతున్నారు. తరువాత మీ ఇష్టం. అందుకే వాళ్ళనలా భయపిస్తూ తిప్పుతున్నాను. నాలుగు రోజులు సరైన డోసు ఇస్తే లెవెల్ ఐపోతాడు. తర్వాత మీ ఇష్టం." అన్నాడు యస్.ఐ.

"మరి ఆలోచించటం ఎందుకు? కేసు కట్టేయండి సార్! వెధవ తాగుబోతుకి సంకటం కుదురుతుంది." అన్నాడు డ్రిల్ మేష్టార్.

"పోనీ మీరు మరోసారి ఆలోచించుకోండి. ఈ కేసు ముందుకి తీసుకెళ్ళాలా వద్దా అన్నది మీరు తీసుకొనే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరెవరూ మీలాటి ఉద్యోగస్తుల జోలికి రాకుండా చేసే పూచీ మాది. నాలుగురోజులపాటు బెత్తంతో తగలిస్తే చాలు ఊళ్ళోవాళ్ళు బెదురుతారు. అదే కోర్టులు, కేసులు అంటే ఓ పట్టాన తెమలవు. ముఖ్యంగా అతగాడి కుటుంబపరంగా మనం ఆలోచించాలి." యస్.ఐ. లేచి నిలబడుతూ అన్నాడు.

సింహాద్రి భార్య పరిగెత్తుకుంటూ వచ్చింది. దాదాపు మా కాళ్ళ మీద పడ్డానికి సిద్ధపడుతోంది. ఈ సంఘటన మూలంగా ఇంట్లో ఎవ్వరికీ మనశ్శాంతి లేదని, మానవతా దృష్టితో చూడాలని ప్రాధేయపడింది. తమ ఇంటి పరిస్థితులన్నీ పూసగుచ్చినట్టుగా వివరించుకుంటూ వచ్చింది. అన్నీ విన్నారంతా! రోడ్డు మీద కొచ్చాం.

(మిగతా 27వ పేజీలో)

(19వ పేజీ తరువాయి)

"వీళ్ళనిలా వదిలిపెడితే కుక్కతోక వంకరలానే ఉంటుంది వ్యవహారం. మనం ఇలా మధ్యలో కేసు విత్‌డ్రా చేసుకుంటే మనలో ఏదో లొసుగుందనుకుంటారు. అందుకనే మనం కేసు బిగించటమే మంచిది. ఇదిగో జగన్నాథంగారూ! మీరేం జడవద్దు. రేపు మరోసారి యస్పీని కలిసి కేసు కట్టేయమని చెబుదాం. మేమంతా స్థిరంగా ఉన్నాం. ఈ పోలీసులు వాళ్ళతో ఏదో లాలూచీ పడి డబ్బు గుంజేసి ఉంటారు. అందుకే మనల్ని కేసు వెనక్కి తీసుకోమంటున్నారు. మెల్లగా మెత్తబరుస్తున్నారందుకే! మీరు ఏమాత్రం తగ్గొద్దు. మీ నిర్ణయం మీదే ఆధారపడి ఉంది మన పరువుప్రతిష్ఠలు నిలుపుకోవడమన్నది. వాడి తాట ఒలిచేలా చేయాల్సిందే!

'మేమంతా మీ వెనకున్నాం' అని వెన్నుదన్నులిచ్చారు మా సిబ్బంది.

నాకు జరిగిన ఘోరం తలుచుకున్న నా హృదయం అట్టుడికి పోతోంది. ఇంటికి వెళ్ళాక సంగతంతా శ్రీమతికి వివరించాను. రోజులు బాగాలేకేనే అలా జరిగి ఉంటుందని ఖర్మ సిద్ధాంతం వల్లించింది. ఆ రాత్రంతా నాకు శుశ్రూషచేసింది. నిద్రలోకి జారిపోయాను.

* * *

మర్నాడు నేను పాఠశాల సందులోకి నడుస్తున్నాను. అంతే! హఠాత్తుగా నా కాళ్ళకి అడ్డంగా పడింది ఎవరో కాదు సింహాద్రి పెళ్ళాం పిన్నమ్మ.

"అయ్యా! నన్ను కనికరించండయ్యా! ఈ రోజు మీరు కేసు కట్టేస్తే జరిగే ఘోరం మీకు తెలవదయ్యా! నా పెనిమిటిని జైల్లో పెడితే చుట్టాలందరికీ తెలిసిపోతుంది. ఇప్పటికే మా పెద్దమ్మాయికి మనువు కుదిరింది. అటువైపు వారికి తెలిస్తే మాతో సంబంధం తెంపుకుంటారు. దాంతో మా అమ్మాయినెవరూ చేసుకుందికి ముందుకి రారు. దాని జీవితం బుగ్గవుతుంది. అందుకే మిమ్మల్నింతలాగ బతిమిలాడుతున్నా బాబయ్యా! ఓ ఆడకూతుర్ని చూసయినా మీ మనసు మార్చుకోండయ్యా!" అని నేను వినిపించుకోకున్నా సరే ఆమె తన గోడును వినిపించుకుంటూ లబోదిబోమని ఏడుస్తోంది. అయినా నేను ఖాతరు చేయలేదు.

మరి కొంతదూరం వెళ్ళేసరికి ఓ అమ్మాయి నాకెదురుగా వచ్చింది. "సార్! సార్! ఆగండాగండి... మీకు దెబ్బతగిలిందట కదా సార్! చాలా ఘోరం సార్! కానీ మిమ్మల్ని కొట్టింది మా నాన్నే! తాగితే మాత్రం మనిషి కాదు సార్! మీ మీద కక్షతో కొట్టలేదు. మీరు.

మా నాన్నను చంపినా పాపం లేద్సార్! కానీ మీరు మా నాన్నను జైల్లోగానీ పెట్టిస్తే మా అక్క పెళ్ళి చెడిపోతుంది. మా పరువు బజారుపాలవుతుంది. ఆ అవకాశం భరించలేక మా అమ్మ నుయ్యో గొయ్యో చూసుకుంటుంది. మరి మా తమ్ముడ్ని నన్ను ఎవరు చూస్తారు సార్! మీకు తగిలిన గాయం నాలుగురోజుల్లో తగ్గిపోతుంది. కానీ, మామీద పడ్డ మచ్చ మాత్రం జీడి మరకలా వదలదు. కుటుంబం సర్వనాశనం అవుతుంది. దయచేసి మమ్మల్ని చూసయినా మీరు మంచి మనసుతో కనికరించండి. కేసు పెట్టరుకదా సార్! ప్లీజ్ సార్!" అంటూ దీనంగా వేడుకుంది. ఆ పిల్లను అప్పుడు పోల్చాను. ఎనిమిదో తరగతి చదువుతోంది. మా స్కూల్లే! ఆ లేత మొహం చూసి జాలికలిగిన మాట మాత్రం నిజమే! అయితే నేనింకా ఓ నిర్ణయానికి రావడానికి సమయం పడుతుంది. అది మా సంస్థతో ముడిపడి ఉంది.

నేను స్కూలుకి వెళ్ళాక ఈ రెండు సంఘటనలు చెప్పాను.

"వాళ్ల కల్లబొల్లి ఏడుపులకి మనం లొంగిపోతే రేపు మనం ఈ ఊళ్ళో ఉద్యోగాలు చెయ్యనక్కర్లేదు. ఎవడో ఒకడు వచ్చి అడ్డంగా నరికి పారేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మీరేం కనికరించనక్కర్లేదు. పదండి. కేసు పెడదాం. అదీ నాన్‌బెయిలబుల్... అలాగయితేనే మన మంటే భయపడతారు జనం! మీరేం వెనక్కి తగ్గద్దు." అని రాతపూర్వకంగా నాచేత సంతకం పెట్టించుకొని మరీ యస్పీకి ఫిర్యాదుఇచ్చారు. ఎస్పీ మరోసారి నన్ను ఒప్పించడానికి ప్రయత్నించాడు. అయితే నేను మాత్రం ఒప్పుకోలేదు. కేసు ఆన్‌లైన్లో ఖరారయిపోయింది. అందర్నీ కాదని వెనక్కి తగ్గే ప్రయత్నంచేసే సాహసం చేయలేకపోయానెందుకో!

ఈ విషయం ఊరంతా తెలిసింది. గోలగోల అయిపోయి, అట్టుడికి పోయింది. మా నిర్ణయం పలువురిని విభ్రాంతికి గురిచేసింది. మర్నాడు నేను స్కూలుకి బయలుదేరాను. ఆటో దిగి ఇలా నడుస్తున్నానో లేదో కూర్మారావు పరిగెత్తుకుంటూ వచ్చి "అయ్యా! గురూగారూ! కొంప మునిగిపోయింది. సింహాద్రిని జైల్లో పెట్టారని తెలిసి వాళ్ల పెద్దమ్మాయికి కుదిరిన సంబంధం తెగిపోయిందట. ఆ విషయం ఇలా తెలీడమేంటి అలా ఆ అమ్మాయి ఉరిపోసుకుందిట బాబూ! ఆ ఘోరం చూసి తట్టుకోలేక సిన్నమ్మ పురుగుల మందు తాగేసి చచ్చిపోయిందట! ఆ పిల్లల కన్నీళ్ళు చూస్తే తట్టుకోలేకపోయాం. ఊర్లో అంతా మనల్ని ఎంత అసహ్యించుకుంటున్నారో! మీరు కూడా ఒక్కసారి ఆలోచించవలసింది. చూసారా! చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఏమిటి?" అని మొత్తం వివరించుకొచ్చాడు.

**వాడేదో తాగొచ్చి నన్ను కొడితే నాకు గాయం అయిన మాట నిజమే! అది క్షమించరాని నేరమే కావచ్చు. కానీ నా గాయం పది రోజులక యినా మచ్చ కూడా మిగలకుండా తగ్గించే మందులున్నాయి. మరి ఆ కుటుంబం పైన పడ్డ చెడ్డ ముద్ర చెరగిపోతుందా?**

నా గుండెలొక్కసారిగా ఘూర్ణిల్లాయి. వాడేదో తాగొచ్చి నన్ను కొడితే నాకు గాయం అయిన మాట నిజమే! అది క్షమించరాని నేరమే కావచ్చు. కానీ నా గాయం పది రోజులకయినా మచ్చకూడా మిగలకుండా తగ్గించే మందులున్నాయి. మరి ఆ కుటుంబం పైన పడ్డ చెడ్డ ముద్ర చెరగిపోతుందా? తెలివిలో ఉన్న తను అందరూ ఏదో రెచ్చగొడితే ఊరుకోకుండా కేసు పెట్టేసాడు. దాని ప్రభావం ఎంత దారుణంగా మారిందో తలుచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

ఊరంతా ఒకటే జనం తరలివెడుతోంది. ఆ దుర్ఘటన చూడ్డానికి. నన్నో పురుగులా చూస్తున్నారంతా! నన్నో తాగుబోతు అకారణంగా కొట్టిన విషయం జనం మరచిపోయారు. నేను కేసుకట్టినందునే వాళ్ళ కుటుంబం బలయిపోయిందన్న ప్రచారం బలపడిపోయింది. ఛీ! ఎంత అపప్రథ! నన్ను కొట్టినా నేను ఏదో యస్.ఐ శిక్షించిన మేరకు చాలనుకుని అతన్ని విడిచిపెట్టవలసింది. నా ఖర్మకొద్దీ జరిగిందనుకోవాల్సింది.

సరిగ్గా అదే సమయంలో సింహాద్రి తండ్రి నన్ను గొరగొర ఈడ్చుకొని వెళ్ళి "చూడవయ్యా! చూడు! ఎంత ఘోరం జరిగిపోయిందో! నీకిప్పటికైనా కడుపు నిండిందా? పీటలమీద కూర్చోవాల్సిన పెళ్ళికూతురు ఇలా పాడె మీదకి ఎక్కింది. చూడు బాగా చూడు! తన భర్త కటకటాల పాలయ్యాడని తెలిసి, పిల్ల ఉరిపోసుకోవటం కళ్లారా చూసి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందయ్యా సిన్నమ్మ. నువ్వు పెట్టిన కేసుకి అతగాడు జైలుకి వెళితే, వీళ్ళేమో తమకి తాముగా శిక్షించుకున్నారు. నీ మూలంగా బలైపోయారు. నీకిప్పుడు మహదానందంగా ఉంది కదూ! సంబరాలు చేసుకోవయ్యా! హాయిగా ఊపిరి పీల్చుకో! నిన్ను గాయపరచినందుకు శిక్షగా వీళ్ళని పొట్టనపెట్టుకున్నావు కదా! చాలా నీ కసి తీరిందా? లేక ఆ పసివాళ్ళని కూడా చంపుకుతింటావా? ప్రతీకారం చల్లారింది కదా!" అని ఒకటే బావురుమన్నాడు.

నా కళ్ళు ఆ దృశ్యాలను చూడలేనంతగా ఘోరంగా ఉన్నాయి వారి చావులు.

"నో!!" ఒక్కసారిగా నేను కేకలేసాను. నా ఒడలంతా గగుర్పాటు!!

"ఏమిటండీ! అలా అరిచారు. ఎందుకంత ఉలికిపాడు." అడిగింది అంకిత.

అంటే నా మనసులో ఇంతదాకా తారాట్లాడిన భయానక దృశ్యాలు భ్రమలేనా! నన్ను విచలితుడిని చేసి సంఘర్షణకు గురిచేసినదంతా ఉత్తి స్వాప్నికమా! కాదు... కానే కాదు... నాలో చెలరేగిన భావజాలం నన్ను మేలుకొలిపే సజీవ చిత్రాలు నాలో లోపాలను ఎత్తి చూపించే నిగ్గుటద్దాలు...!! వాటి మూలంగా నాకు గాయంచేసిన వాడిమీద నేను వేయబోయే కేసు మూలాన ఆ కుటుంబం ఎంతలా విధ్వంసమౌతుందో తెలియవచ్చింది.

నిజానికి నేను సింహాద్రిని కటకటాలపాలు చేస్తే కలిగే ప్రయోజనం? నా చుట్టూ ఉన్న వారు నన్ను రెచ్చగొట్టారని, వెనక్కి తగ్గితే పరువుపోతుందని చెప్పి నేను నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తే, అందుకు ప్రతిఫలం... రెండు చావులా? దానివల్ల నాకు ఒనగూడేది?!

నా గాయం ఇప్పుడిప్పుడే మానుతోంది. కానీ వారి మనసులో రేగిన మానసిక గాయాలు... మానని పుళ్ళై జీవితాంతం వెంటాడి వేధిస్తునే ఉంటాయి.

ఆ వాస్తవం గ్రహించిన నా మనసులో విషయాలన్నీ అంకితతో చెప్పకుండా ఉండలేకపోయాను.

"ఔనండీ! మీ మనసులో చెలరేగిన పెనుతుఫాను నేనర్థం చేసుకోగలను. ఎవడో తెలీక చేసిన పనికి పగబూనినట్టుగా మనం ప్రవర్తిస్తే అది మానవత్వం అనిపించుకోదు. పైగా అది అందరి దృష్టిలో దారుణ నిర్ణయం అనిపించుకుంటుంది. మీ మనసు ఏది చెబితే ఆ ప్రకారం నడుచుకుంటే మంచిది.

అంకిత చెప్పినట్టే నేను నా మనసు మేలుకొలుపుతో సంస్కార భావాలను నెలకొల్పుకొని నా మనసు చెప్పిన విధంగా నడచుకోవాలని నిశ్చయించుకున్నాను. మరి వేరెవరు చెప్పినా వినే ప్రశ్న లేదుగాక లేదు... అంతే...!!

★

**రచయిత చిరునామా:**
కె.కె.రఘునందన,
రామతీర్థం (పి.ఒ.)
విజయనగరం జిల్లా- 535218.